
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
జిల్లా వార్తలు
3
ఆదివారం 15 సెప్టెంబరు 2024



మంత్రి తుమ్మలను కలిసిన డీసీసీబీ చైర్మన్ సత్తయ్య



రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 14 : మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో రైతు రుణమాఫీ అమలుపై మంత్రితో చర్చించారు.

వినాయక నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలి

మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



మహేశ్వరం, సెప్టెంబరు 14 : మహేశ్వరం నియోజకవర్గంతో పాటు జిల్లా ప్రజలు వినాయక నిమజ్జనోత్సవాల్లో జాగ్రత్తలు పాటించాలని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి (కేఎల్లార్) సూచించారు. శనివారం ఆయన తుక్కుగూడలో విలేకరులతో మాట్లాడుతూ నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో సంతోషంగా జరుపు కోవాలని ఆయన తెలిపారు. నిమజ్జనాల్లో పాల్గొనే యువకులు పోలీసుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. విగ్రహాల ఊరేగింపులో భాగంగా టపాసులు కాల్చేటప్పుడు వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తపడాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు చూడాలన్నారు.


సాంకేతికతకు కేంద్రం

ఇంజనీరింగ్‌కు దిక్సూచి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఘనత

ఇంజనీరింగ్ కాలేజీలు	రంగారెడ్డి	మేడ్చల్
	41	45

ఆనాటి ఇంజనీరింగ్ ప్రతిభకు గుర్తుగా నిలిచిన ఫిరంగి నాలా



- శతాబ్దంన్నర కిందటే అద్భుత కట్టడాలు
- ఫిరంగి నాలా, జంట జలాశయాల నిర్మాణాలు
- ఇంజనీర్ స్ఫూర్తి ప్రదాత మోక్షగుండం
- రాష్ట్రంలో అత్యధిక ఇంజనీరింగ్ కాలేజీలు ఇక్కడే
- నేడు ఇంజనీర్ల దినోత్సవం

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఎన్నో అద్భుత కట్టడాలున్నాయి. ఆ నాటి జంట జలాశయాల నుంచి నేడు చేపడుతున్న అనేక నిర్మాణాల వరకు ఇంజనీర్ల ప్రతిభ బయటపడుతుంది. ఆనాటి మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఇంజనీరింగ్ ప్రతిభతో నిర్మాణమైన అనేక కట్టడాలు నేటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. ఆయన చూపిన బాటలో నడిచేందుకు నేడు ఉమ్మడి జిల్లాలో వేలాది మంది విద్యార్థులు ఇంజనీరింగ్ చదువును అభ్యసిస్తున్నారు. అద్భుత ప్రతిభను చూపుతున్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య పుట్టిన రోజు సందర్భంగా ఆయన ప్రతిభకు తార్కాణంగా సెప్టెంబరు 15ను ఇంజనీరింగ్ డేగా గుర్తిస్తూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇంజనీరింగ్ డే సందర్భంగా ప్రత్యేక కథనం..

రంగారెడ్డి అర్బన్/ షాద్‌నగర్, సెప్టెంబరు 14: ఇంజనీరింగ్ కేంద్రంగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వర్ధిల్లుతోంది. దేశ, అంతర్జాతీయ స్థాయిలో పేరెన్నిక గల సంస్థలకు నిలయంగా మారింది. రాష్ట్రంలోనే అత్యధిక ఇంజనీరింగ్ కాలేజీలు ఉమ్మడి జిల్లాలోనే ఉన్నాయి. ఇంజనీరింగ్ విద్యతో పాటు ఉత్పత్తి, సేవా రంగాల్లో అగ్రగామిగా ఉన్న ఉమ్మడి జిల్లా ఉపాధి కల్పనలోనూ దేశంలోనే కీలంగా ఉంది. ఇక్కడ బీటెక్‌తో పాటు, ఇతర కోర్సులు చేసిన ఇంజనీర్ విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నతస్థాయిలో ఉద్యోగాలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా సాంకేతిక రంగాల్లో అగ్రగామిగా ఉండడానికి ఎంతోమంది కృషి ఉంది. ఇక్కడ కాలేజీల ఏర్పాటుతో పాటు ప్రముఖ సంస్థల నిర్మాణాలకు గత పాలకులు అహర్నిశలు శ్రమించారు. ఇక్కడ ఇంజనీరింగ్ కాలేజీల ఏర్పాటుతో పాటు ఉపాధి కల్పనకు అంతర్జాతీయ, జాతీయ స్థాయి కంపెనీలతో ఇక్కడ పెట్టుబడులు పెట్టించారు. దీంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇపుడు ఇంజనీరింగ్‌కు కేంద్రంగా మారింది. రాష్ట్రంలో మొత్తం 175 ఇంజనీరింగ్ కాలేజీలు ఉండగా ఇందులో 96 కాలేజీలు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోనే ఉండడం గమనార్హం. సర్కారు ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలు ఎప్పుడు వస్తాయని ఎదురు చూస్తూ కూర్చోవడం, ఇంజనీరింగ్ పట్టాలు పుచ్చుకుని సినిమా తరహాలో పరిశ్రమల చుట్టూ తిరగడం .. ఇలాంటి పరిస్థితులు పెద్దగా కనిపించడం లేదు. దీనికి కారణం ఉమ్మడి ఏపీ ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రులు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో పాటు తెలంగాణ ఆవిర్భావం తర్వాత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఐటీ, ఇతర పరిశ్రమల ఏర్పాటుకు ఎంతో కృషి చేశారు. హైటెక్ సిటీ నిర్మాణం అనంతరం శివారు ప్రాంతాల దశ తిరిగింది. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్ లాంటి మారుమూల గ్రామాలను కలుపుకొని హైటెక్ సిటీగా మార్చారు. దీంతో ఈ ప్రాంతాల్లో వందల కొద్ది సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ పరిశ్రమలు నెలకొల్పడం వల్ల వేలాదిమంది యువతీ యువకులు ఉద్యోగాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇంజనీరింగ్ విద్యను

- మిగతా 5వ పేజీలో



గెలుపే మార్గం



విద్యను అభ్యసించిన తర్వాత ఎవరు ఉద్యోగం ఇస్తారా? అంటూ ఎదురు చూసే పరిస్థితి ఉండకూడదు. ఇంజనీరింగ్ చేయడం ద్వారా కళాశాల దశలోనే క్యాంపస్ సెలక్షన్‌కు ఎంపికయితే అనుకున్న జీవితాన్ని సాధించుకోగలుతాం. అందుకే ఇంజనీరింగ్ విద్యను ఎంచుకున్నాను. ప్రస్తుతం సక్సెస్ వైపు నా ప్రయాణం సాగుతుంది.

- సనా సుహానా, ఇంజనీర్

భవిష్యత్తు నిర్మాణం



దేశ అభివృద్ధి నిర్మాణంలో ఇంజనీరింగ్ విద్య కీలక పాత్ర పోషిస్తుంది. విదేశాల్లోనూ ఈ విద్యకు మంచి భవిష్యత్తు ఉంది. అందుకే ఈ విద్యను ఎంచుకున్నాం. మంచి కంపెనీల్లో అవకాశాలు వస్తే లక్షల్లో వేతనాలు చెల్లిస్తున్నారు. ఈ విద్య వల్ల భవిష్యత్తుకు ఢోకా ఉండదు

- సాయికృష్ణ రాహుల్, ఇంజనీర్



గిజిగాని గూడు.. అల్లుతుంది చూడు



మనిషితో పాటు ప్రతి జీవికి ఎండా, వాన, చలి బారిన పడకుండా తల దాచుకునేందుకు ఓ గూడు కావాలి. ప్రతి జీవి జీవితంలో ఇది తప్పనిసరి. మనుషులు జీవించే ఇళ్ల నిర్మాణంలో అధునాతన ఇళ్ల నుంచి ఆకాశ హర్మ్యాల వరకు రకరకాలు కనిపిస్తుంటాయి. వీటిని ఎందరో అనుభవం కలిగిన ఇంజనీర్లు ప్లాన్లు గీసి నిర్మాణాలు చేపడుతుంటారు. కానీ, పక్షులకు ఏ ఇంజనీరూ అవసరం లేదు. కూలీల సహకారం అంతకంటే అవసరం లేదు. తమ గూడును తమకు అనుకూలంగా ఉండేలా.. ఇంజనీర్ల ప్రావీణ్యాన్ని తలదన్నేలా నిర్మించుకుంటాయి. అలా మొయినాబాద్ మండలం ఎన్కేపల్లి గ్రామ సమీపంలోని ఓ చెట్టుపై పిచ్చుకలు తమ గూడును అల్లుకుంటున్నాయి. అవి గూడును అల్లుకుంటున్న దృశ్యాన్ని ఆ దారిన పోయే వారు ఆసక్తిగా చూస్తున్నారు.

- మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 14


17 నుంచి గురుకుల ఉపాధ్యాయుల ఆందోళన బాట

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 14 : జిల్లాలోని గురుకుల ఉపాధ్యాయులంతా వారి సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 17 నుంచి ఆందోళన బాట పట్టనున్నారు. ఉపాధ్యాయుల సమస్యలతో పాటు గురుకులాల్లో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. 17, 18 తేదీల్లో నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు కానున్నారు. 19న గురుకుల కార్యదర్శులకు, ప్రధానాచార్యుల ద్వారా లేఖలు సమర్పించనున్నారు. 28న పాఠశాల, కళాశాలలో విధులను(పెన్‌డౌన్, చాక్‌డౌన్) బహిష్కరించనున్నారు. 010 పద్దు ద్వారా ఉపాధ్యాయుల, ఉద్యోగుల జీతాలను చెల్లించాలని, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా గురుకుల ఉద్యోగులకు హెల్త్ కార్డులను పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర బాధ్యతలను తొలగించాలని, నైట్ స్టే విధుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని, డిప్యూటీ వార్డెన్ విధుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలన్నారు. గురుకుల ఉపాధ్యాయులకు కనీసం 2 స్టేజీల అదనపు స్కేల్స్‌నురాబోయే పీఆర్సీలో ఇప్పించాలని, అన్ని గురుకుల సొసైటీలను ఒక గొడుగుకింద నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. అన్ని గురుకులాల్లో 70:30 నిష్పత్తి ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని, సమస్యలను పరిష్కరించకుంటే అందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

ఆకాశంలో భూముల ధరలు

పోలీస్ స్టేషన్లలో పంచాయితీలు

- కేసులతో కోర్టుల చుట్టూ తిరుగుతున్న దాయాదులు
- గ్రామాల్లో నిత్యం ఘర్షణలు, పరస్పర దాడులు
- మంట గలుస్తున్న మానవ సంబంధాలు
- ఎకరంన్నర భూమి కోసం తండ్రి కాళ్లు నరికిన కుమారుడు
- రెండెకరాల కోసం తండ్రిని కడతేర్చిన తనయుడు
- ఎనిమిది నెలల్లో ఇబ్రహీంపట్నంలో నమోదైన కేసులు 150



యాచారం, సెప్టెంబరు 14 : దినదినాభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ రియల్‌ఎస్టేట్ వ్యాపారం పెరగడం, శంషాబాద్ విమానాశ్రయంతో పాటు పలు సంస్థలు నెలకొల్పడం, ఫార్మాసిటీ ఏర్పాటుకు ప్రభుత్వం భూసేకరణ చేయడంతో కొంత మేర భూముల ధరలు పెరిగిన సంగతి తెలిసిందే. ఇటీవల కందుకూరు మండలంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు సీఎం భూమిపూజ చేయడంతో యాచారం మండలంలో భూముల ధరలు ఆకాశాన్నంటే అవకాశం ఉంది. ఇకపోతే ఆర్‌ఆర్‌ఆర్ కార్యరూపం దాల్చితే భూముల ధరలు మరింత పెరిగే అవకాశముందని రియల్టర్లు చెబుతున్నారు. అయితే, భూముల ధరలు పెరుగుతుండడంతో పాటు భూ తగాదాలు కూడా హెచ్చుమీరుతున్నాయి. పొలం హద్దులు, రెవెన్యూ రికార్డుల తారుమారు, తదితర కారణాలతో భూతగాదాలు పెరుగుతున్నాయి. ప్రతీ గ్రామంలో భూముల విషయంలో నిత్యం తగాదాలు, ఘర్షణలు జరుగుతున్నాయి. ఈక్రమంలో మానవ సంబంధాలు మంటకలుస్తున్నాయి. భూముల ధరలు పెరగడంతో జన్మనిచ్చిన తల్లిదండ్రులపై కుమారులు దాడులకు తెగబడుతున్నారు. భూ హద్దుల వివాదంతో నిత్యం అనేకమంది పేద, మధ్యతరగతి రైతులు తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాలతో పాటు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. భూ తగాదాల కారణంగా సొంత అన్నదమ్ములు సైతం విడిపోయి ఒకరిపై ఒకరు కక్ష పెంచుకుంటున్నారు. గ్రామాల్లో తరచూ పంచాయితీలు జరుగుతున్నాయి. వీటిని కట్టడి చేయడానికి పోలీసులు నానాతంటాలు పడుతున్నారు. పోలీస్‌స్టేషన్లలో ప్రతీరోజు నాలుగైదు ఫిర్యాదులు కేవలం భూతగాదాలకు సంబంధించినవి వస్తున్నాయంటే సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కాగా, ధరణి పోర్టల్ కంటే ముందు భూరికార్డుల నవీకరణ(ఎల్‌ఆర్‌యూపీ) సమయంలో అనేక తప్పులు దొర్లడంతో రైతులు తనకే పట్టాపాస్‌బుక్ వచ్చిందని, ఈ భూమి తనదేనని గొడవలకు దిగుతుండడంతో గ్రామాల్లో తరచూ ఘర్షణ వాతావారణం కనిపిస్తోంది. కక్షిదారులు పరస్పర దాడులకు దిగడం, పోలీసులు కేసులు నమోదు చేయడం పరిపాటిగా మారింది. అయితే, ఈ విషయంలో కొందరు నాయకులు పోలీసులపై ఉన్నతాధికారులకు, సోషల్ మీడియాలో తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ఇటీవల కిషన్‌పల్లి భూ తగాదా విషయంలో పోలీసులు సివిల్ తగాదాలో తలదూర్చారని తప్పుడు ఆరోపణలు చేశారు. ఇదే విషయమై ఏసీపీ కేపీవీ రాజు విచారించడంతో సివిల్ తగాదాల్లో పోలీసులు తలదూర్చలేదని తేలడంతో ఆరోపణలు చేసినవారు నేడు నోరెత్తడం లేదు. ధరణి పోర్టల్‌లో అన్నదమ్ముల భూముల రికార్డులకు సంబంధించి విస్తీర్ణాల్లో తేడాలు రావడం, తల్లిదండ్రుల మరణానంతరం భూముల పంపకాలు, పత్రాలు కూడా అస్తవ్యస్తంగా ఉండడంతో సోదరులు తరచూ గొడవలకు దిగుతున్నారు. తమకు అనువైన భూమి కావాలని అన్నదమ్ములే పరస్పర దాడులకు దిగుతుండడం సాధారణమైంది. వీఆర్వో వ్యవస్థను రద్దు చేయడంతోనే భూతగాదాలు మరింత పెరుగుతున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా.. చాలావరకూ రెవెన్యూ సిబ్బంది భూ తగాదాలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. వారి నిర్లక్ష్యమే అసలైన కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఎక్కువగా భూముల గెట్టు పంచాయితీలు, భూమిని

- మిగతా 6వ పేజీలో

గ్రంథాలయాల్లో మెరుగైన వసతుల ఏర్పాటు

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్‌కుమార్



ఆమనగల్లు, సెప్టెంబరు 14: జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాల్లో పాఠకులకు అనుగుణంగా మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్‌కుమార్ తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గ్రంథాలయాలకు అధునాతన భవనాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఆమనగల్లు పట్టణంలోని శాఖ గ్రంథాలయాన్ని శనివారం మనోజ్ కుమార్ సందర్శించారు. గ్రంథాలయ రికార్డులను పరిశీలించారు. అక్కడ ఉన్న పాఠకులతో సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని షాబాద్, కొత్తూరు, కొందుర్గు, చేవెళ్ల, వనస్థలిపురం, మాడ్గులలో నూతన గ్రంథాలయ భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఇబ్రహీంపట్నం గ్రంథాలయం వద్ద అదనపు రీడింగ్ హాల్ నిర్మిస్తున్నట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా పది గ్రంథపాలకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రభుత్వం వాటిని త్వరలో భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటుందని మనోజ్‌కుమార్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రంథాలయాలలో పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఆమనగల్లు గ్రంథాలయంలో మెరుగైన వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



బేగరికంచ వెంచర్‌లో పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

ఫార్మాసిటీ భూ బాధితులకు

త్వరలో ప్లాట్లు

వాటిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

పనుల్లో నాణ్యత కొరవడరాదు : కలెక్టర్ శశాంక

యాచారం/ కందుకూరు, 14 : ఫార్మాసిటీ కోసం భూములిచ్చిన రైతులందరికీ త్వరలో ప్లాట్‌లు కేటాయిస్తామని, వెంచర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. ప్లాట్‌లలో అన్నిరకాల వసతులు కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. యుద్ధప్రాతిపదికన పనులు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వెంచర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్ శశాంక శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనులు ఎక్కడ జరుగుతున్నాయని కలెక్టర్ మ్యాప్ తెప్పించి అధికారులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనుల్లో నాణ్యత కొరవడితే ఊపేక్షించేది లేదన్నారు. తరచూ పనులను పర్యవేక్షించాలని అధికారులకు వివరించారు. భూ బాధితులకు డ్రా పద్ధతిన ప్లాట్ కేటాయించనున్నట్లు తెలిపారు. కేటాయించిన ప్లాట్లలో వసతులు లేవని రైతులు ఆందోళన చెందకుండా చూడాలన్నారు. ఫార్మాసిటీ కోసం భూములు ఇచ్చిన రైతులకు ప్లాట్ ఇవ్వడానికి బేగరికంచలో వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. వెంచర్‌లో వసతులు యుద్ధప్రాతిపదికన కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కాగా రైతులకు న్యాయం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ కలెక్టర్‌ను కోరారు.

రోగులకు మెరుగైన సేవలందించండి

గర్భిణులు బాలింతలకు మెరుగైన సేవలందించాలని, ఆసుపత్రుల్లో ఓపీల సంఖ్య మరింత పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శశాంక అన్నారు. యాచారంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకెలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ యాచారం ఆసుపత్రి భవనానికి తాత్కాలికంగా మరమ్మత్తులు చేయించుకోవాలని, ఇందుకు అవసరమైన అంచనాను ఇంజనీరింగ్ అధికారులతో వేయించి ఇస్తే నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ఇక్కడ కొత్త భవనం పూర్తవడానికి మరో రెండు మూడేళ్లు పడుతుందని, అప్పటి వరకు ఉన్న భవనానికి మరమ్మతులు చేయించుకోవాలని కలెక్టర్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజును ఆదేశించారు. త్వరలో చిన్నపిల్లల స్పెషలిస్టులను, ఈఎన్‌టీ వైద్యులను పంపుతామని కలెక్టర్ వెల్లడించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దారు అయ్యప్ప, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్, డాక్టర్ రాజ్యలక్ష్మి తదితరులున్నారు.

కిందిస్థాయి ఉద్యోగుల కలలను బాధ్యతగా నెరవేరుస్తాం



లచ్చిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు, ఉద్యోగులు

శామీర్‌పేట, సెప్టెంబరు 14: రెవెన్యూ శాఖలో కింది స్థాయి ఉద్యోగుల కళలను బాధ్యతగా నెరవేరుస్తామని తెలంగాణ ఉద్యోగుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ లచ్చిరెడ్డి అన్నారు. తూంకుంటలోని మొగుళ్ళ వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్ర రెవెన్యూ శాఖకు చెందిన ఉద్యోగులు ఆత్మీయ అభినందన సభను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రంలోని రెవెన్యూ శాఖకు చెందిన ఉద్యోగ సంఘాల టెక్నికల్ మేనేజర్లు టైపిస్టులు, కంప్యూటర్ ఆపరేటర్ల తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీకి నూతనంగా ఎన్నికైన ఛైర్మన్ లచ్చిరెడ్డిని అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. లచ్చిరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు సకాలంలో వేతనాలు రాక ఎన్నో ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఈసమస్యను పరిష్కరిండానికి కృషి చేస్తానన్నారు. హౌసింగ్ సొసైటీని ఏర్పాటు చేసిన తర్వాత రెవెన్యూ ఉద్యోగులందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలను ఇచ్చే ఆలోచన జేఏసీకి ఉందని, రాబోయే ఫోర్త్ సిటీలో అందరికీ ఇళ్లు ఇప్పించడానికి చర్యలు తీసుకుంటానన్నారు.

మాదకద్రవ్యాలను నిర్మూలించాలి

శామీర్‌పేట, సెప్టెంబరు 14: మాదకద్రవ్యాలను నిర్మూలించాలని సీఎంఆర్ ఐటీ కళాశాల ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ విజయ పిలుపునిచ్చారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని దేవరయాంజాల్‌లో శనివారం కండ్లకోయలోని సీఎంఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాల ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ విజయ, అడ్వయిజర్ జయశ్రీ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజంలోని ప్రతీఒక్కరు కృషిచేయాలని అధ్యాపకులు, విద్యార్థులు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వల్ల అనర్థాలపై వారు అవగాహన కల్పిస్తు ప్రదర్శనలిచ్చారు. మాదకద్రవ్యాలను, మద్యపానం, సిగరెట్లను నివారించాలని పాఠశాల విద్యార్థులు పోస్టర్లపై రాసి ప్రదర్శించారు. తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు నర్సింగ్‌రావుగౌడ్, గోల్డ్ శ్రీనివాస్, నర్సింహారెడ్డి, పాల్గొన్నారు.

బీజేపీ విధానాలను తిప్పికొట్టండి

తాండూరు, సెప్టెంబరు 14: తెలంగాణ ప్రాంత ప్రజలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అందించిన తెలంగాణ సాయుధ పోరాటాన్ని బీజేపీ అవమానపరుస్తోందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఎస్.బాలమల్లేష్ అన్నారు. తాండూరులో శనివారం జరిగిన వికారాబాద్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం పీడిత ప్రజల విముక్తి కోసం కొనసాగించిన పోరాటాన్ని, చరిత్రను తప్పుదొవ పటిస్తున్నారని అన్నారు.17వ సెప్టెంబర్‌ను తెలంగాణ విమోచన పేరిట వక్రీకరిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఈ దినాన్ని అధికారికంగా విలీన దినంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి విజయలక్ష్మీపండిత్ మాట్లాడుతూ పాఠ్య పుస్తకాలలో తెలంగాణ సాయుధ పోరాటాన్ని పొందుపర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బషీర్ అహ్మద్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రవీందర్, కార్యవర్గ సభ్యులు పీర్ మహమ్మద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాలమల్లేశ్

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

తలకొండపల్లి, సెప్టెంబరు 14:మండల పరిధి గ్రామాల్లో ప్రజలకు వసతుల కల్పన, అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యే నారాయణరెడ్డిని కోరారు. శనివారం మాజీ సర్పంచ్ వెంకట్రామ్‌రెడ్డి, నాయకుడు బాల్‌రెడ్డిలతో ఎ మ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నిధుల మంజూరుకు వినతి పత్రం ఇచ్చారు. గ్రామాలు, తండాల్లో డ్రెయిన్లు, సీసీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిరుపేదలందరికీ ఇందిరమ్మఇళ్లు కేటాయించాలని కోరారు. రేవంత్‌రెడ్డి కల్వకుర్తి ప్రాంతానికి చెందిన వ్యక్తేనని, అధిక నిధులివ్వాలని కోరారు.


రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న కాంట్రాక్టర్, నాయకులు

కత్వవాగు వద్ద రోడ్డుకు మరమ్మతు

ఆమనగల్లు, సెప్టెంబరు 14 : మేడిగడ్డ-శంకర్ కొండ కత్వవాగు వద్ద శనివారం రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు కత్వ వాగు సాగి రెండు తండాల మధ్య బ్రిడ్జి నిర్మిస్తున్న స్థలంలో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రాళ్లు తేలి రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కత్వవాగును పరిశీలించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వెంటనే పాడైన రోడ్డుకు మరమ్మతులు చేయించాలని సంబంధిత కాంట్రాక్టర్, అధికారులకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్ రోడ్డు మరమ్మతు పనులను జేసీబీతో చేపట్టి రాకపోకలకు ఇబ్బందుల లేకుండా చేశారు.

సభ్యత్వ నమోదులో
బీజేపీది గిన్నిస్ రికార్డ్

● మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్


సభ్యత్వ నమోదు పత్రాలు అందిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

మూడు చింతలపల్లి, సెప్టెంబరు 14 : ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వ నమోదు పొందిన పార్టీగా బీజేపీ గిన్నిస్ బుక్ రికార్డు పొందిందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం మూడుచింతలపల్లి మండలంలో పార్టీ మండలాధ్యక్షుడు నందాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఈటల పాల్గొని సభ్యత్వ నమోదు పత్రాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఒక పండగలా జరుపుకుందామన్నారు. తెలంగాణలో బీజేపీని ఆదరించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ బలోపేతానికి బూత్‌స్థాయిలో నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. ఇప్పటి వరకు ఉన్న పార్టీ గిన్నిస్ రికార్డును అధిగమించాలన్నారు. నాయకులు, కార్యకర్తలు కలిసి కట్టుగా ఉండి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుద్ధి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు నరేందర్ గౌడ్, నాగరాజు, మూడుచింతలపల్లి, పార్టీ మండల ఇన్‌చార్జి జగన్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక సీఎంను కలిసిన మల్లు రవి


సిద్ధరామయ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంపీ మల్లు రవి

ఆమనగల్లు, సెప్టెంబరు 14: కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను శనివారం పార్లమెంట్ ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కమిటీ సభ్యుడు, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి మర్యాదపూర్వకంగా కలిశారు. కర్ణాటకలోని బెంగుళూరులో సిద్ధరామయ్యను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ఆరు గ్యారంటీల అమలు, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గూర్చి సిద్ధరామయ్యకు వివరించినట్లు రవి తెలిపారు. అలాగే కర్ణాటకలో పార్లమెంట్ సభ్యులకు కల్పిస్తున్న సౌకర్యాలు, అమలు చేస్తున్న పథకాల గురించి అధ్యయనం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కర్ణాటక వైద్యారోగ్య శాఖ, పరిశ్రమలు, రోడ్లు, భవనాల శాఖ మంత్రులను కూడా కలిసి అభివృద్ధి పనుల గురించి తెలుసుకున్నట్లు తెలిపారు. మల్లు రవి వెంట హైదరాబాద్‌కు చెందిన కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి, కర్మాన్‌ఘాట్ ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్ రఘుమారెడ్డి, తదితరులు ఉన్నారు.

కౌశిక్‌రెడ్డిపై దాడిని ఖండిస్తున్నాం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్, సెప్టెంబరు 14: హైదరాబాద్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. కొడంగల్ పట్టణంలోని మార్కెట్ యార్డులో శనివారం వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓ ఎమ్మెల్యేపై మరో ఎమ్మెల్యే దాడికి పాల్పడటం సమంజసం కాదని, ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు. మాజీ జడ్పీటీసీ మహిపాల్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు నవాజుద్దీన్, సురేశ్‌రాజ్, రాఘవేందర్‌రెడ్డి, నందారం పవన్, రాజశేఖర్ తదితరులున్నారు.

దశలవారీగా హామీల అమలు


అభయహస్తం ధ్రువపత్రాలు అందిస్తున్న నాయకులు

కందుకూరు, సెప్టెంబరు 14: ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం దశలవారీగా నెరవేరుస్తుందని ఆ పార్టీ నాయకులు బొక్క నరేందర్‌రెడ్డి, ఎస్.శంకర్‌గౌడ్, ఎండీ ఖదీర్, సామ పాండురంగారెడ్డిలు తెలిపారు. శనివారం మండలంలోని కొత్తగూడ గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన అభయహస్తం ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్ఠానం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను తూచా తప్పకుండా అమలు చేయనున్నట్లు గుర్తుచేశారు. అభయహస్తం ద్వారా కొత్తగూడ గ్రామస్తులకు మొదటి విడతగా 291మందికి 500వందలకు గ్యాస్ సిలిండర్‌ను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పథకం నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు. నాయకులు రాజశేఖర్‌రెడ్డి, మహేందర్, చెన్న కృష్ణ, ముచ్చర్ల రవి పాల్గొన్నారు.

జర భద్రం

ఆదమరిస్తే అంతే సంగతులు ● రోడ్లు, కల్వర్టులపై ప్రమాదకరంగా గుంతలు
మరమ్మతులకు నోచని వైనం ● పట్టని అధికారులు, పాలకులు

మున్సిపాలిటీ పరిధిలో కల్వర్టులు, రోడ్లపై గుంతలు పడి రహదారులు ప్రమాదకరంగా మారాయి. నడి రోడ్లపై ఉండడంతో ప్రజలు భయపడుతున్నారు. మున్సిపాలిటీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అసలే వానాకాలం వర్షపు నీటితో రోడ్లు జలమయమైనప్పుడు గుంతలు కనిపించక అందులో పడిపోతే అంతే సంగతులు. ప్రమాదాలు జరగక ముందే మరమ్మతులు చేపట్టాలి. రోడ్లు, కల్వర్టుల వద్ద ఏర్పడిన గుంతలపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్..

- తాండూరు, సెప్టెంబరు 14

నడి రోడ్డులో గుంత



తులసి గార్డెన్ సమీపంలో నడిరోడ్డుపై గుంత ఏర్పడింది. రెండు నెలలు దాటినా మరమ్మతులు చేపట్టలేదు. కనీసం గుంతను పూడ్చలేదు. వర్షపు నీరు నిలిచి గుంత కనపడడం లేదు. వాహనదారులు, పాదాచారులు ఇందులో పడినా, ఇరుక్కుపోయినా ప్రాణనష్టం జరిగే అవకాశాలున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు



సాయిపూర్ ప్రాంతంలోని రోడ్డుపై ఉన్న కల్వర్టుకు పెద్ద గుంత (రంధ్రం) పడింది. ప్రమాదంగా మారడంతో ప్రజలు అటు వైపు వెళ్లినప్పుడు భయపడుతున్నారు. గుంతను పూడ్చాలని కాలనీ వాసులు కోరుతున్నారు. కాగా, తాత గుడి పక్కనే ఉన్న కల్వర్టు నుంచి రాత్రింబవళ్లు రాకపోకలు సాగిస్తుంటారు.

అంబేడ్కర్ పార్కు వద్ద..



పాత తాండూరు అంబేడ్కర్ పార్కు పక్కన పెద్ద గుంత ఏర్పడింది. ఈ రోడ్డు వెంట బస్తీ దవాఖానకు రోగులు, సిబ్బంది, హాస్టల్ విద్యార్థులు, పోలీసులు క్వార్టర్స్‌కు వెళ్తుంటారు. రద్దీ ఎక్కువగా ఉండే ఈ రోడ్డు పక్కన పెద్ద గుంత ఏర్పడింది. రాత్రి సమయాల్లో అటుగా వెళ్లాలంటే జనం భయపడుతున్నారు.

రైల్వే అండర్‌బ్రిడ్జి కింద..



పాత తాండూరు ప్రజలకు రైల్వే అండర్‌బ్రిడ్జి ప్రధాన రహదారి. నిత్యం దీని కింద నుంచి తాండూరుకు రాకపోకలు సాగిస్తుంటారు. అసలే ఈ బ్రిడ్జి కింద లైట్లు లేకపోవడంతో చీకటిగా ఉంటుంది. దాంతో రాత్రివేళ ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయి. అదేవిధంగా వంతెన కింద రోడ్డులో పెద్ద గుంత పడింది. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఘడి కోటేశ్వరాలయం, హరిజన వాడ బస్తీ ప్రజలు ఎక్కువగా ప్రయాణం సాగిస్తుంటారు.

ప్రమాదకరంగా కల్వర్టు



వైష్ణవి హోండా షోరూం పక్కన ఉన్న కల్వర్టు ఇది. సీకులు తేలి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు ఈ కల్వర్టు గుండా వెళ్లాలంటే భయపడుతున్నారు. చూసీచూడనట్లు వెళితే అందులో ఇరుక్కుపోయే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు మరమ్మతులు చేపట్టాలి

తాండూరు మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో గల రోడ్లు, కల్వర్టుల మధ్య గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలి. వాహనదారులు, స్థానిక ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని పలువురు విన్నవిస్తున్నారు.

సాంకేతికతకు కేంద్రం.. ఇంజనీరింగ్‌కు దిక్సూచి


ఇంజనీరింగ్ ప్రతిభకు తార్కాణంగా నిలిచిన హిమాయత్‌సాగర్ డ్యాం నిర్మాణం

ఉమ్మడి జిల్లాల్లో పరిశ్రమలు	
రంగారెడ్డి	1,09,164
మేడ్చల్	92,235
వికారాబాద్	15,001

స్థూల ఉత్పత్తి (రూ.కోట్లలో)	
రంగారెడ్డి	1,98,997
మేడ్చల్	62,506
వికారాబాద్	14,345

ఎగుమతుల్లో..

జిల్లా	సరుకుల ఎగుమతి	శాతం
రంగారెడ్డి	34,249కోట్లు	29
మేడ్చల్	25,444కోట్లు	22

(3వ పేజీ తరువాయి)

అభ్యసిస్తే జాబ్ గ్యారెంటీ అని భావిస్తుండటంతో ఇంజనీరింగ్ విద్యకు ఆదరణ మరింత పెరుగుతోంది. ఇప్పటికే సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లలో అగ్రగామిగా ఉన్న ఉమ్మడి జిల్లా విమానాలు, హెలికాప్టర్ల తయారీ కేంద్రంగా కూడా అవతరించింది. తలసరి, స్థూల ఉత్పత్తి, ఎగుమతుల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా దూసుకుపోతోంది.

ఆనాడే.. ఇంజనీరింగ్ ప్రతిభ

దాదాపు శతాబ్దంన్నర కింద నగర శివార్లలోని గ్రామాలకు సాగు, తాగునీటి సరఫరాకు నిర్మించిన ఫిరంగి నాలా ఒక అద్భుతమనే చెప్పాలి. కబ్జాలకు, ఆక్రమణలకు గురైన ఈ నాలా గురించి ఇపుడు ఎవరికీ పెద్దగా తెలియక పోవచ్చు. కానీ, ఈ నాలా నిర్మాణం ఇంజనీరింగ్ ప్రతిభకు తార్కాణమని చెప్పాలి. 85 కిలో మీటర్ల పొడవైన ఈ నాలా షాబాద్‌లోని చందన్‌వెల్లి నుంచి ప్రారంభమై ఇబ్రహీంపట్నం చెరువులో కలుస్తుంది. ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్‌తో పాటు నల్లగొండ ప్రాంతాలకు తాగు, సాగునీటి అవరాల కోసం అప్పటి నిజాం ప్రభువు 1872లో ఫ్రెంచ్, ఇంగ్లీష్ ఇంజనీర్ల సలహాలతో కాలువ నిర్మాణాన్ని చేపట్టారు.. షాబాద్ మండలం చందన్‌వెల్లి నుంచి చేవెళ్ల, మొయినాబాద్, శంకర్‌పల్లి, రాజేంద్రనగర్, శంషాబాద్, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం మండలాల మీదుగా కాలువ ప్రవహిస్తుంది. 40 నుంచి 50 గ్రామాలకు తాగునీటితో పాటు వేలాది ఎకరాలకు సాగునీరు అందించే బృహత్తర లక్ష్యంతో దీన్ని చేపట్టారు. ఈ నాలా శివార్లలోని అనేక చెరువులను కలుపుతూ చివరకు ఇబ్రహీంపట్నం పెద్దచెరువుకు చేరుకునేలా డిజైన్ చేశారు. ఈకాలువ నిర్మాణంలో అద్భుతమేమిటంటే నాలా ప్రారంభం నుంచీ చివరి వరకు సమతలంగా నీరు పారే విధంగా డిజైన్ చేయడం.

విశ్వేశ్వరుడు డిజైన్ చేసిన జంట జలాశయాలు

ఒకప్పుడు ధనవంతులకే పరిమితమైన ఇంజనీరింగ్ విద్య ప్రస్తుతం పేద, మధ్య తరగతి జీవితాల్లో కూడా కీలకంగా మారింది. మహోన్నతుడు, భారతరత్నగా గుర్తింపు పొందిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య వేసిన బాట నేటి యువత భవిష్యత్తుకు బాసటగా మారింది. నేటి ఇంజనీర్ల దినోత్సవాన్ని ఒక్కసారి మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను తలుచుకుంటే.. ఆయన వేసిన బంగారు బాటలు నేటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాయి. విశ్వేశ్వరయ్యకు ఈ ప్రాంతానికి వీడని సంబంధం ఉంది. 1908లో హైదరాబాద్‌కు వరదలు రావడంతో వేలాది మంది చనిపోయారు. దీంతో నిజాం ప్రభువు భవిష్యత్తులో హైదరాబాద్‌కు వరద ముప్పులేకుండా చేసేందుకు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను సంప్రదించారు. దీనికి అంగీకరించిన విశ్వేశ్వరయ్య హైదరాబాద్‌కు వరద ముప్పే కాకుండా నగర వాసులకు తాగునీటి అవసరాలను తీర్చేవిధంగా ఈ రెండు జలాశయాల నిర్మాణం చేపట్టారు. హైదరాబాద్‌కు ఇప్పటికీ ఈ జంట జలాశయాలు ప్రధాన తాగునీటి వనరులుగా ఉండడం గమనార్హం. ఇవి జలాశయాలు రంగారెడ్డిజిల్లా పరిధిలోనే ఉన్నాయి.

విద్యార్థుల సమస్యపై
నిరంతర పోరాటం



మాట్లాడుతున్న భీమరాజు

కొడంగల్ రూరల్, సెప్టెంబరు. 14: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందని తెలంగాణ రాష్ట్ర రెవల్యూషనరీ స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడు భీమరాజు అన్నారు. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన ఆర్ఎస్‌యూ జాతీయ సమావేశానికి హాజరై మాట్లాడారు. తెలంగాణ, ఏపీలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, పాఠశాల, కళాశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం, విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, అట్టి సమస్యల పరిష్కారానికి ఆర్ఎస్‌యూ పోరాటం చేస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం
డైరెక్టర్‌గా నర్సింహారెడ్డి


నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న కోమటిరెడ్డి

దోమ, సెప్టెంబరు 14: నల్గొండ, రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం డైరెక్టర్‌గా మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన ఆగిరాల నర్సింహారెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో నర్సింహారెడ్డిని మంత్రి కోమటిరెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించి అత్యధిక మెజార్టీతో గెలిపించిన పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

వర్గ పోరాటాలను ఉధృతం చేస్తాం

● సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జంగయ్య

చేవెళ్ల, సెప్టెంబరు 14 : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తి నేటి వర్గపోరాటాలకు నాంది అని, సీపీఐ ఆధ్వర్యంలో వర్గ పోరాటాలను ఉధృతం చేస్తామని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య పిలుపునిచ్చారు. శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట 76వ వార్షికోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం గడీల పాలన, నిజాం నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కలిగించిన పోరాటం నేటికీ ప్రపంచ పోరాటాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. నిజాం ముస్లిం కావడంతో హిందువుల పోరాటం అని చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ విలీన దినం జరపాలని డిమాండ్ చేయడం సిగ్గుమాలిన చర్య అని అన్నారు. విలీన దినమని ఒక పార్టీ, విద్రోహ దినమని మరో పార్టీ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి సంబంధంలేని నాయకులు, పార్టీలు ఇప్పుడు గొంతెత్తి మాట్లాడుతున్నారని, ఆనాడు జరిగిన పోరాటంలో వారు ఎక్కడ ఉన్నారని నిలదీశారు. ఆ పోరాటంలో పాల్గొని కమ్యూనిస్టులు ప్రాణాలు అర్పించారని గుర్తుచేశారు. భవిష్యత్తులో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో జిల్లాలో వర్గ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణాచారి, సీపీఐ మండలాల కార్యదర్శులు సత్తిరెడ్డి, జంగయ్య, శ్రీనివాస్, సుధీర్, సహాయ కార్యదర్శి మక్బూల్, సీనియర్ నాయకులు కృష్ణగౌడ్, యాదగిరి, నారాయణ, రఘు, యాదమ్మ, లలిత, వెంకటమ్మ, రమాదేవి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాల్మాకుల జంగయ్య

వేంకటేశ్వరుడికి లక్ష తులసి అర్చన

చేవెళ్ల, సెప్టెంబరు 14:మండల పరిధి తంగడ్‌పల్లిలో గల దశావతార సమేత లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో భాద్రపద, శ్రావణ మాసాల ను ముగింపును పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారికి నవకలశ, అభిషేకం, హోమం, సహస్రనామ అర్చనలను వేదమంత్రోచ్చరణల మధ్య కొనసాగించారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు. అర్చకులు అయ్యవారి వెంకటాచార్యులు, శేషాద్రి, వేణుమాధవ్, గ్రామస్తులు, భక్తులు తదితరులు ఉన్నారు.


వేంకటేశ్వరాలయంలో తులసి పుష్పార్చన చేస్తున్న అర్చకులు

ఎస్‌జీఎఫ్‌లో సత్తా చాటిన
ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

కేశంపేట, సెప్టెంబరు 14: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడల్లో కేశంపేట ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో పోటీపడి గెలిచారు. మండల కేంద్రంలోని హైస్కూల్ ఆవరణలో ఈనెల 11, 12, 13వ తేదీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి క్రీడలు నిర్వహించారు. ఇందులో రాణించిన వారిని జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. అండర్ 17 కబడ్డీ బాలుర విభాగంలో ఎంజేపీ కేశంపేట విజేతగా నిలువగా, ఎస్ఆర్‌కే తొమ్మిదిరేకుల పాఠశాల రన్నరప్‌గా నిలిచింది. అండర్ 17 బాలికల కబడ్డీ విభాగంలో పాపిరెడ్డిగూడ పాఠశాల విద్యార్థులు విజేతగా నిలువగా, కొత్తపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రన్నరప్‌గా నిలిచారు. అండర్ 14 బాలికల కబడ్డీ విభాగంలో పాపిరెడ్డిగూడ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు విజేతగా.. ఎంజేపీ, కేజీబీవీ విద్యార్థులు రన్నప్‌గా, అండర్ 14 బాలుర కబడ్డీ విభాగంలో కేశంపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు విజేతగా, కొత్తపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు రన్నప్‌గా నిలిచి సత్తాచాటారు. ఈమేరకు శుక్రవారం కేశంపేట జడ్పీహెచ్ఎస్ ఆవరణలో మెడల్స్, మెమొంటోలు అందించారు. పీడీ, పీఈటీలను కేశంపేట ఇన్‌చార్జి ఎంఈవో మనోహర్, కేశంపేట మండల నోడల్ అధికారి చంద్రశేఖర్‌లు అభినందించారు.


ఎస్‌జీఎఫ్ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

అన్ని గ్రామాలు, తండాలకు బీటీ రోడ్లు

కడ్తాల్, సెప్టెంబరు 14 : మారుమూల గ్రామాలు, అన్ని తండాలకు ఏడాదిలోపు బీటీ రోడ్లు నిర్మిస్తామని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ అమలు చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కడ్తాల మండలం కర్కల్‌పహాడ్, ఎక్వాయిపల్లి, కోనాపూర్ గ్రామాల నాయకులు శనివారం ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. స్థానిక సమస్యలను ఆయనకు వివరించి వాటి పరిష్కారానికి నిధులు కేటాయించాలని కోరారు. కర్కల్ పహాడ్ గేటు వద్ద బస్సులు నిలపక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేకు తెలిపారు. ఎక్వాయిపల్లి, మర్రిపల్లి, ముద్విన్, చరికొండ, పల్లె చెల్కతండా, కర్కల్‌పహాడ్, వాసుదేవ్‌పూర్, ఇతర తండాల ప్రజలు కర్కల్‌పహాడ్ నుంచే ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తారన్నారు. ఇక్కడ బస్సులు నిలపక ఆమనగల్లు, కడ్తాలకు వెళ్లి, అక్కడ దిగిపోతున్నారని వాపోయారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే కల్వకుర్తి ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడి కర్కల్‌పహాడ్ గేటు వద్ద బస్‌స్టాప్ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు పాలకూర్ల కరుణాకర్‌గౌడ్, ఏదుల రఘుపతి, మోహిన్, ఈర్లపల్లి పాండు, కోనాపూర్ వెంకటేశ్, జగన్, శేషు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ హబీబుల్లాఖాన్

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

శంకర్‌పల్లి, సెప్టెంబరు 14: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శంకర్‌పల్లి సీఐ హబీబుల్లాఖాన్ అన్నారు. శంకర్‌పల్లిలోని వివేకానంద కళాశాలలో శనివారం జరిగిన ఫ్రెషర్స్ పార్టీలో పాల్గొని మాట్లాడారు. క్రమశిక్షణతో మెలిగి అధ్యాపకులు చెప్పే పాఠాలను అవగతం చేసుకొని జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ హన్మంతరెడ్డి, ఎస్సై సంతోష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మోయిన్ పాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదల పాలిట సంజీవని సీఎంఆర్‌ఎఫ్


లబ్ధిదారులకు ఎల్వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట, సెప్టెంబరు 14: సీఎం సహాయ నిధి పథకం పేదల పాలిట సంజీవనిగా నిలుస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కేశంపేట మండలం నిర్దవెల్లికి చెందిన బండ కార్తీక్(10) చెవికి సంబంధించిన వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న విషయం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్ ద్వారా ఎమ్మెల్యే తెలుసుకున్నారు. బాలుడి వైద్యానికి సీఎం ఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.3లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్(ఎల్వోసీ)ని శనివారం షాద్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బాలుడి కుటుంబసభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అనారోగ్యం బారిన పడుతున్న నిరు పేదలకు కార్పొరేట్ వైద్యం అందించి స్వస్థత చేకుర్చేందుకు సీఎం సహాయ నిధి పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. బండ కార్తీక్‌కు సీఎం సహాయనిధిని ఇప్పించేందుకు కృషిచేసిన కాంగ్రెస్ మండల నాయకులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, వెంకట్‌రెడ్డి, కొత్త శ్రీశైలం, దిద్దెల ముత్యాలు, బద్ది మల్లయ్య, జంగయ్య, అమీర్, రామకృష్ణ, చంద్రయ్య, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు ఎంపిక


పోటీలకు ఎంపికైన బీసీ విద్యార్థులతో ఉపాధ్యాయులు

చౌదరిగూడ, సెప్టెంబరు 14 : జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని ఇంద్రనగర్‌లో గల పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు జోనల్ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో గురుకుల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి జోనల్‌స్థాయికి ఎంపియ్యారన్నారు. ఈ సందర్భంగా శనివారం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీటీ ప్రవీణ్‌కుమార్, శ్రీశైలం పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడి కుటుంబానికి ఎంపీ అరుణ పరామర్శ


కడెంపల్లి సదానంద్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ డీకే.అరుణ

కొత్తూర్, సెప్టెంబరు 14: బీజేపీ సీనియర్ నాయకుడు కడెంపల్లి సదానంద్‌గౌడ్ కుటుంబ సభ్యులను మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ శనివారం పరామర్శించారు. సదానంద్‌గౌడ్ సోదరుడు రఘునందన్‌గౌడ్ కుమారుడు శ్రీధర్‌గౌడ్ ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీ అరుణ కొత్తూర్‌లోని సదానంద్‌గౌడ్ ఇంటికి చేరుకొని రఘునందన్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు నాగరాజుచారి, మహేందర్‌రెడ్డి, ఇ.శ్రీనివాస్,మోహన్‌సింగ్,గోవర్ధన్‌గౌడ్, సుధాకర్, మహేందర్, అరవింద్, రాఘవేందర్‌గుప్తా, వేణుగోపాల్‌చారి, సురేందర్, రవి ఉన్నారు.

ప్రతీ ఒక్కరికి 'ఆయుష్మాన్' కార్డులు ఇవ్వాలి


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 14: ఆయుష్మాన్ భారత్ కార్డులు ప్రతీ ఒక్కరికి ఇవ్వాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయలక్ష్మి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం చించోడు పీహెచ్‌సీ పరిధిలోని కిషన్‌నగర్ సబ్‌సెంటర్‌లో శనివారం ఆయుష్మాన్ భారత్ అమలును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ 'అబా' కార్డుంటే రూ.5లక్షల వరకు వైద్య సదుపాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఆధార్ కార్డు ఉన్న ప్రతొక్కరు అబా కార్డు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతో ఆనందమయ జీవనం


పూజలు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌యాదవ్

తలకొండపల్లి, సెప్టెంబరు 14 : ఆధ్యాత్మిక చింతనతో ఆనందమయ జీవనం సాగించొచ్చని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్.శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం లేమామిడి శివాలయాన్ని ఆయన సందర్శించి పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు శ్రీనివాస్‌ను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మఠం శంకరయ్య, గోపాలకృష్ణ, రవి తదితరులు ఉన్నారు.

'బూర్గుల' సేవలు మరువలేనివి

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 14: హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు చేసిన సేవలు చరిత్రలో నిలుస్తాయని రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ మండల పరిషత్ ఆవరణలో ఉన్న బూర్గుల రామకృష్ణారావు విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. షాద్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి ముఖ్యమంత్రి కావడం మనందరికి గర్వకారణమన్నారు.


బూర్గుల రామకృష్ణారావు విగ్రహానికి పూల మాల వేస్తున్న ఎమ్మెల్యే శంకర్

కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి స్మారక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలి

మాడ్గుల, సెప్టెంబరు 14 : మాడ్గులలో విద్యార్థులకు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత కోసం గ్రంథాలయాన్ని, అలాగే వృత్తి విద్యా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆమనగల్ ఏఎంసీ మాజీ చైర్మన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బట్టు కిషన్‌రెడ్డి ఎమ్మెల్యే నారాయణరెడ్డిని కోరారు. శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలసి వినతి పత్రం ఇచ్చారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా మండల కేంద్రానికి ఎక్కువ నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గౌరవరం ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కొత్త పాండుగౌడ్, పార్టీ నాయకులు సూదిని కొండల్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాంరెడ్డి, చిన్నికృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా చల్లా నర్సింహారెడ్డి జన్మదిన వేడుకలు


మహేశ్వరం: చల్లా నర్సింహారెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న మర్యాద మురళీధర్‌రెడ్డి

మహేశ్వరం/కడ్తాల్, సెప్టెంబరు 14 : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి జన్మదిన వేడుకలను శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.నర్సింహారెడ్డికి మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మర్యాద మురళీధర్ రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జానకీరామ్, రమేష్, ప్రవీణ్, చంద్రమోహన్ పాల్గొన్నారు. నర్సింహారెడ్డి జన్మదిన వేడుకలను కడ్తాలలో జరుపుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్ ఆధ్వర్యంలో యువజనకాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్‌చేశారు. కార్యక్రమానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, సేవాలాల్ సేన రాష్ట్రకార్యదర్శి లక్పతి హాజరయ్యారు. నాయకులు చేగూరి వెంకటేశ్, జహాంగిర్‌బాబ, గురిగళ్ల లక్ష్మయ్య, శ్రీకాంత్, యాదయ్య, లక్ష్మణ్‌నాయక్, మంకి శ్రీను, మహేశ్, బాల్‌రాజ్, జహంగీర్‌అలీ, షాబుద్దీన్ పాల్గొన్నారు. అలాగే హైదరాబాద్‌లో చల్లా నర్సింహారెడ్డిని పీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, జగన్, బీచ్య, జి.శ్రీనివాస్‌రెడ్డి, బిక్యాలు కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జవహర్‌లాల్, బాల్‌రాజ్, చేగూరి వెంకటేశ్, తులసీరామ్ తదితరులున్నారు.


చల్లాను సన్మానిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, ప్రభాకర్‌రెడ్డి, జగన్, బిచ్యా, బిక్యా


కడ్తాలలో కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మృతుడి కుటుంబానికి పరామర్శ

తలకొండపల్లి , సెప్టెంబరు 14 : గట్టిప్పలపల్లికి చెందిన కానుగుల నాగేశ్ అనే వ్యక్తి మృతిచెందాడు. అతడి మృతదేహానికి శనివారం బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి నివాళులర్పించారు. నాగేశ్ కుటుంబీకులను పరామర్శించి రూ.3వేల ఆర్థికసాయం అందజేశారు. పరామర్శించిన వారిలోరాజు, జంగయ్య, అనంతరాములు,చెన్నయ్య, నర్సింహ, కుమార్, ఆంజనేయులు ఉన్నారు.

● వినాయక పూజలు, నిమజ్జనాలు


ఇబ్రహీంపట్నం: వెంకటరమణ కాలనీలో గణేష్ పూజల్లో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరిస్తున్న డీసీపీ సునీతారెడ్డి


చౌదరిగూడలో ఆర్యవైశ్య సంఘం సభ్యుల పూజలు


కొత్తూర్ పరిధి భవానీ నగర్‌కాలనీలో మండపం వద్ద ముగ్గుల పోటీని తిలకిస్తున్న కౌన్సిలర్ హేమదేవేందర్


శంషాబాద్ రూరల్: వినాయకుడి పూజల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర నాయకుడు బుక్క వేణుగోపాల్


షాబాద్: గణేష్ నిమజ్జనంలో పాల్గొన్న శ్రీ చైతన్య హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు


కడ్తాల్ : మైసిగండిలో పూజ నిర్వహిస్తున్న తహసీల్దార్ ఆర్పీ.జ్యోతి-అరుణ్ దంపతులు


తలకొండపల్లి వినాయకుడి పూజల్లో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు


కడ్తాల్: మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఐ శివప్రసాద్

కాటి కాపరుల సంక్షేమానికి ప్రభుత్వాలు చొరవ చూపాలి

కందుకూరు, సెప్టెంబరు 14: కాటి కాపరుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత చొరవ చూపి నిధులు మంజూరు చేయాలని సంఘం రాష్ట్ర నాయకుడు గాదె సత్తయ్య, జిల్లా అధ్యక్షుడు బేగరి మల్లేష్ కోరారు. కందుకూరు మండల కాటి కాపరుల సంఘం ఏర్పాటై 23 ఏళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన ఆవిర్భావ వేడుకల్లో మాట్లాడారు. ప్రతొక్క కాటి కాపరికి ప్రభుత్వం రూ.10లక్షల బీమా,ప్రతీనెల రూ.25వేల వేతన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాటి కాపరి మరణిస్తే తహసీల్దార్ ద్వారా దహసన సంస్కారాలకు రూ.25వేల ఇప్పించాలన్నారు. పూజారులకు ప్రభుత్వాలు ఇస్తున్న వేతనం లాగానే తమకూ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బ్యాగరి కుమార్, మండల నాయకులు బి.లక్ష్మయ్య, బి.నరసింహ, మహేష్, బి.చెన్నయ్య, బి.ప్రశాంత్, బి.దానయ్య, అంజయ్య, టి.నరసింహ పాల్గొన్నారు.


ఆవిర్భావ వేడుకల్లో సంఘం నాయకులు

సేవలతోనే సమాజంలో గుర్తింపు : సీఐ

ఆమనగల్లు, సెప్టెంబరు 14 : సేవా కార్యక్రమాలతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని సీఐ ప్రమోద్‌కుమార్ అన్నారు. దాతృత్వం, సేవాభావాన్ని ప్రతీ వ్యక్తి అలవర్చుకోవాలని కోరారు. ఆమనగల్లు బస్టాండ్ ఆవరణలో శనివారం ఆమనగల్లు ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ ఉప్పల రాములు తన తండ్రి జంగయ్య యాదవ్ స్మారకార్థం అన్నదానాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సీఐ ప్రమోద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై అన్నదానాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక సేవ, ప్రజాచైతన్య కార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ముందుండాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరు ఉన్నంతలో తోటి వారికి సాయమందించి జీవితాన్ని సార్థకం చేసుకోవాలని సీఐ సూచించారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ఆమనగల్లు లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలను కొనియాడారు. క్లబ్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని క్లబ్ జిల్లా అధ్యక్షులు నటరాజ్ యాదయ్య, ఎం.చంద్రశేఖర్, జె.రమేశ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మెంబర్లు కర్నాటి కొండల్‌రెడ్డి, పాండురంగారెడ్డి, వెంకటయ్య, బాలకృష్ణ, రూపం వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి సేవలు మరువలేం

యాచారం/శంషాబాద్, సెప్టెంబరు 14: పేదల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం దివంగత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి నిరంతరం తపించేవారని యాచారం మండల మహిళా సంఘ అధ్యక్షురాలు అరుణ, సీపీఎం కార్యవర్గ సభ్యుడు చందూనాయక్ అన్నారు. శనివారం మంతన్ గౌరెల్లిలో సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళ్లర్పించారు. కార్యక్రమాల్లో రాములు, లక్ష్మయ్య, వంకేశ్వరం, యాదయ్య, రాము పాల్గొన్నారు. శంషాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో సీతారాం ఏచూరి చిత్రపటానికి సీపీఎం నాయకులు నివాళులు అర్పించారు. సీపీఎం జిల్లా నాయకులు మల్లేష్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి ప్రజాసమస్యలపై అలుపెరుగని పోరాటం చేశారని, ఆయన ఆశయ సాధనకు కృషిచేయాలన్నారు. ప్రణయ్, పవన్‌కుమార్, మల్లేష్, ప్రమోద్, భానుచందర్ పాల్గొన్నారు.

ఆదర్శ సమాజ నిర్మాణానికి గురువు మార్గదర్శి


సన్మానం పొందిన ఉపాధ్యాయులు

ఆమనగల్లు/కందుకూరు, సెప్టెంబరు 14 : ఆదర్శ సమాజ నిర్మాణానికి గురువు మార్గదర్శి అని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ డి.కోటేశ్వర్‌రావు అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయులన్నారు. ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ నాగోల్‌లోని పీటీఆర్ కన్వెన్షన్‌లో గుర్రం పాండయ్య అధ్యక్షతన ఆచార్య దేవోభవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోటేశ్వర్‌రావు, రిటైర్డ్ ప్రొఫెసర్ వెంకట్‌రెడ్డి, రీజియన్ చైర్మన్ శ్రీను, జోన్ చైర్మన్ జనార్ధన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. 84 క్లబ్‌ల పరిధి 180మంది ఉత్తమోపాధ్యాయులను సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి మహేశ్, కోశాధికారి నర్సింహ, పీఆర్వో పాషా, సభ్యులు రమేశ్, సురేశ్, మహేంద్రకుమార్‌రెడ్డి, ఓంకారం, లింగయ్య, అంజిరెడ్డి, అంజయ్య, శివరామ్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సుజాత, మురళీధర్‌రెడ్డి, రహీం, విష్ణుమూర్తి, కిరణ్మయి, అరుణ, కందుకూరు క్లబ్ కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, ట్రెజరర్ వెంకటేశ్వర్లు గుప్తా, పీఆర్టీయూ మండల బాధ్యులు బుచ్చయ్యగుప్తా పాల్గొన్నారు.

ఆకాశంలో భూముల ధరలు పోలీస్ స్టేషన్లలో పంచాయితీలు

(మూడో పేజీ తరువాయి)

పంచుకోవడంలో భాగంగా దాయాదుల ఘర్షణలు అధికమవుతున్నాయి. మండలానికి ఒక సర్వేయర్ మాత్రమే ఉండడంతో ప్రతీ గ్రామాన్ని తిరగలేకపోవడంతో భూ తగాదాలు హెచ్చుమీరుతున్నాయని రెవెన్యూ అధికారులు బాహాటంగానే చెబుతున్నారు. సర్వేయర్ల సంఖ్యను పెంచితే చాలా వరకు భూ తగాదాలు, పంపకాల సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చని రైతులు, అధికారులు చెబుతున్నారు.

భూ తగాదాలు.. కేసుల నమోదు

యాచారం మండలం గడ్డమల్లాయాగూడలో దాయాదులు పొలం గట్ల విషయంలో పరస్పర దాడులు చేసుకోవడంతో ఇరువురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. చిన్నతూండ్లలో 25 ఏళ్లగా భూ తగాదా కారణంగా రైతులు తరచూ గొడవలకు దిగుతున్నారు. చింతపట్లలోనూ దాయాదుల మధ్య భూ తగాదాలున్నాయి. తనకు తెలియకుండా భూమిని ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేసుకున్నారని మధుసూదన్‌రెడ్డి అనే రైతు పోలీసులను ఆశ్రయించాడు. కిషన్‌పల్లిలో దాయాదుల మధ్య 1999 నుంచి కేవలం ఎకరం భూమి కోసం పరస్పరం గొడవపడుతూ దాడులు చేసుకుంటూనే ఉన్నారు. నల్లవెల్లి రెవెన్యూ పరిధిలోని కిషన్‌పల్లిలో సర్వే నంబర్లు 736లో 2ఎకరాల 12 గుంటలు, 738లో 4ఎకరాల 6గుంటలు, 757లో 12ఎకరాల 6గుంటలు, 758లో 13 ఎకరాల 10గుంటలు, 769లో 4ఎకరాల 35గుంటల చొప్పున భూమి ఉంది. ఈ భూములను మళ్లీ పంచుకుందామని దాయాదులు తరచూ గొడవ, ఘర్షణలకు పాల్పడుతూనే ఉన్నారు. ఇరువర్గాలకు మేలు కలిగే విధంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని యాచారం పోలీసులపై రాచకొండ కమిషనర్‌కు, మానవ హక్కుల కమిషన్‌లో కూడా పలుమార్లు ఫిర్యాదు చేశారు. ఇవి తప్పుడు ఫిర్యాదులని అధికారులు తేల్చారు. గున్‌గల్‌లోని అసైన్డ్ భూమి విషయంలో రెండు వర్గాల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. చిన్నతూండ్లలో 25ఏళ్లగా భూతగాదాలతో రైతులు తరచూ ఘర్షణలకు దిగుతున్నారు. నల్లవెల్లిలో ఆరేళ్లగా సొంత అన్నదమ్ములు ఘర్షణ పడున్నారు. కొత్తపల్లిలో రియల్టర్ల కారణంగా ఇద్దరు రైతుల మధ్య కొంత కాలంగా భూ తగాదాలు కొనసాగుతుండటంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. తమ్మలోనిగూడలో రెండెకరాల భూమి కోసం తండ్రిని ఓ వ్యక్తి హత్య చేశాడనే ఆరోపణలున్నాయి. చింతపట్లలో రెండున్నరేళ్లగా దాయాదులు పోలీస్‌స్టేషన్, కోర్టుల చుట్టూతిరుగుతున్నారు. గున్‌గల్‌లో మూడు ఎకరాల భూమి విషయంలో రెండేళ్లగా గొడవలు సద్దుమనగడం లేదు. గున్‌గల్‌లోని అసైన్డ్ భూమిలో ఆలయ నిర్మాణం వివాదాస్పదం అవడంతో పోలీసుల రంగప్రవేశంతో తాత్కాలికంగా గొడవ సద్దుమణిగింది. పిల్లిపల్లిలో భూమి కోసం ఓ వ్యక్తి తండ్రిని గాయపర్చాడు. యాచారంలో భూ తగాదాలపై 2022లో 22, 2023లో 39, 2024లో ఇప్పటి వరకు 36కేసులు నమోదు చేశామని యాచారం పోలీసులు తెలిపారు. 2024లో ఇబ్రహీంపట్నంలో 16, మంచాలలో 26, యాచారంలో 36, ఆదిబట్లలో 54, మాడ్గులలో 18 కేసులు నమోదయ్యాయి. మేడిపల్లి, ముచ్చర్ల, మీర్‌ఖాన్‌పేట, ఆకులమైలారం గ్రామాల్లో భూ తగాదాల కేసులు నమోదయ్యాయి.

భూ సమస్యలు పరిష్కరించాలి



గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యలు పూర్తిగా పరిష్కరించాలి. ప్రభుత్వం సర్వేయర్లను సరిపడా నియమించి, భూ సర్వే చేయించాలి. రెవెన్యూ రికార్డుల ఆధారంగా హద్దులను గుర్తించి రైతులను ఆదుకోవాలి. గ్రామాల్లో ఎక్కువగా గొడవలు జరుగుతున్నాయి. పంపకాల విషయంలో తల్లిదండ్రులపై దాడులు, హత్యలు సర్వసాధారణమైంది. అన్నదమ్ముల అనుబంధాలు మంటకలిశాయి.
- గూడె సత్తయ్య, రైతు, చిన్నతూండ్ల

క్రైం కార్నర్

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 14:ఇబ్రహీంపట్నానికి చెందిన ఓ మహిళ శుక్రవారం రాత్రి పెద్ద చెరువులోదూకి ఆత్మహత్య చేసుకుంది. శనివారం మధ్యాహ్నం ఆమె మృతదేహాన్ని వెలికితీశారు. కుటుంబ కలహాలతోనే ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఇబ్రహీంపట్నం వెంకటరమణ కాలనీకి చెందిన కప్పాటి మంజుల(48) లంగర్‌హౌస్‌లో జీహెచ్‌ఎంసీ ఔట్ సోర్సింగ్ స్వీపర్‌గా పనిచేసేది. రెండు నెలల క్రితమే ఆమె భర్త పున్నయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. ఈమెకు ముగ్గురు కుమారులు. కుటంబంలో గొడవల కారణంగానే ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

డీజే సౌండ్ బాక్స్‌ల సీజ్



చేవెళ్ల, సెప్టెంబరు 14: అనుమతి లేకుండా డీజే సౌండ్ బాక్స్‌లను ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామని చేవెళ్ల ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలిపారు. చేవెళ్ల, పామెన తదితర గ్రామాల్లో గణేశ్ మండపాల వద్ద ఏర్పాటు చేసిన డీజె సౌండ్ బాక్స్‌లను శనివారం సీజ్ చేశామన్నారు. గణేష్ నిమజ్జనోత్సవాల్లో డీజేలకు అనుమతి లేదన్నారు. నిబంధనలు ఉల్లఘింస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సెక్యూరిటీ గార్డులపై దాడి.. కేసు నమోదు

కొత్తూర్, సెప్టెంబరు 14: తిమ్మాపూర్ శివారులో గల ర్యాడికో కైతన్ పరిశ్రమ సెక్యూరిటీ గార్డులపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. పరిశ్రమలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని సమాచారంతో బీఆర్‌ఎస్ నాయకుడు దేవేందర్‌యాదవ్, తిమ్మాపూర్ కౌన్సిలర్ శ్రీనివాస్, డ్రైవర్ లక్ష్మణ్ శనివారం పరిశ్రమ వద్దకు వెళ్లారని తెలిపారు. పరిశ్రమ గేట్‌ను తెరువకపోవడంతో సెక్యూరిటీ గార్డు జైసింగ్, సూపర్‌వైజర్ భాస్కర్‌రావులపై దాడిచేశారని తెలిపారు. భాస్కర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.